సాక్షి చిత్తూరు

సోమవారం । 19 । ఆగస్టు । 2024



బోయకొండకు భక్తుల తాకిడి

భక్తుల కొంగుబంగారంగా విరాజిల్లుతున్న బోయకొండ గంగమ్మ దర్శనానికి భక్తులు బారులు తీరారు. - 8లో



సారా తయారీపై ఉక్కుపాదం

జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు వెదురుకుప్పం మండలంలోని సారా స్థావరాలపై పోలీసులు మెరుపు దాడి చేశారు. - 8లో



కర్ణాటక మద్యం పట్టివేత

కర్ణాటక నుంచి ఆంధ్రాలోకి అక్రమంగా మద్యం తరలిస్తున్న ఓ వ్యక్తిని పలమనేరు పోలీసులు అరెస్ట్ చేశారు. - 8లో

న్యూస్‌రీల్

నేడు ప్రజాసమస్యల పరిష్కార వేదిక

చిత్తూరు కలెక్టరేట్ : ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 19న కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంట వరకు కార్యక్రమం నిర్వహించబడుతుందన్నారు. జిల్లాలోని ప్రజలు తమ సమస్యలను వినతుల రూపంలో అందజేసి పరిష్కరించుకోవాలని తెలిపారు. అన్నిశాఖల జిల్లా అధికారులు కార్యక్రమానికి తప్పక హాజరుకావాలన్నారు. ఎవరైనా గైర్హాజరైతే శాఖాపరంగా చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు.

నేడు పోలీసు కార్యాలయంలో గ్రీవెన్స్ డే

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలోని వన్‌టౌన్ పక్కన ఉన్న ఆర్మ్డు రిజర్వు (ఏఆర్) కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (గ్రీవెన్స్‌డే) కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎస్పీ మణికంఠ ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజలు వారి సమస్యలు ఏవైనా ఉంటే తనను నేరుగా కలిసి మాట్లాడవచ్చన్నారు. ఇక్కడ ఇచ్చే వినతులు, ఫిర్యాదులను పరిశీలించి చర్యలు చేపడతామని ఎస్పీ తెలిపారు.

మధ్యంతర భృతి ప్రకటించాలి



వినతిపత్రం అందజేస్తున్న జిల్లా ఎస్టీయూ నేతలు

చిత్తూరు కలెక్టరేట్ : ఉద్యోగులు, టీచర్ల 12వ పీఆర్సీ మధ్యంతర భృతిని వెంటనే ప్రకటించాలని ఎస్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు గంటామోహన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ ఆదివారం విజయవాడలో జరిగిన రాష్ట్ర ద్వితీయ కార్యవర్గ సమావేశంలో టీచర్ల సమస్యలను చర్చించినట్లు తెలిపారు. జీఓ 117 రద్దు చేసి 3, 4, 5 తరగతులను ప్రాథమిక పాఠశాలల్లోనే కొనసాగించాలని కోరారు. పీఎఫ్, ఏపీజీఎల్ఐ రుణాలు, ఫైనల్ పేమెంట్స్, మిస్సింగ్ క్రెడిట్స్‌ను వెంటనే ప్రభుత్వం మంజూరు చేయాలన్నారు. ఉమ్మడి సర్వీస్ నిబంధనలు రూపొందించి ఉద్యోగోన్నతులు నిర్వహించాలని కోరుతున్నారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మదన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయుల సర్వీస్ రెగ్యులరైజేషన్ పూర్తి చేసేలా రాష్ట్ర విద్యాశాఖ అధికారులు ఉత్తర్వులు జారీచేయాలన్నారు. ఈహెచ్‌ఎస్ కార్డులతో క్యాష్‌లెస్ వైద్యసదుపాయాలు పొందేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. అనంతరం పలు డిమాండ్లను రాష్ట్ర కమిటీ సమావేశంలో చర్చించి వినతిపత్రం ఇచ్చినట్లు తెలిపారు. నాయకులు శ్రీదేవి, హేమచంద్రారెడ్డి, మురళి, రాజారెడ్డి పాల్గొన్నారు.



భద్రతకు గండం.. విధులకు దండం!

కోల్‌కతా యువ వైద్యురాలి హత్యాచార ఘటన యావత్ భారతావనిని కుదిపేస్తోంది. జిల్లావ్యాప్తంగా కూడా డాక్టర్ల నిరసన, ఆగ్రహ జ్వాలలు రగులుతూనే ఉన్నాయి. ఈ ఘటనపై అన్ని వర్గాలూ ఏకతాటిపైకి వచ్చి న్యాయం కోసం నినదిస్తున్నాయి. బాలికలు, మహిళా రక్షణ కోసం ఎన్ని చట్టాలు చేస్తున్నా సమాజంలో మార్పు రానంతరవకు ఈ అకృత్యాలకు అడ్డుకట్ట పడదు. ఇప్పటికైనా పని చేసే చోట మహిళలకు రక్షణ కల్పించాలని కోరుతున్నారు. నిర్లక్ష్యం వీడకపోతే కీచకుల అకృత్యాలకు అడ్డుకట్ట పడేదెన్నడని మహిళా ఉద్యోగులు, సంఘాలు, వైద్యులు మండిపడుతున్నారు.

- జిల్లాలోని ఆస్పత్రుల్లో భద్రత అంతంతమాత్రమే
- కోల్‌కతా ఘటన తర్వాత ఉలిక్కిపడిన వైద్యులు
- బిక్కుబిక్కుమంటూ విధులకు..
- అప్రమత్తమైన అధికారులు
- మరింత కట్టుదిట్టంగా నిఘా
- అపరిచితులను ఆస్పత్రుల్లో నుంచి వెనక్కి పంపుతున్న సెక్యూరిటీ సిబ్బంది

కాణిపాకం : జిల్లావ్యాప్తంగా గత కొన్ని రోజులుగా కోల్‌కతా యువ వైద్యురాలి హత్య ఘటనపై నిరసన గళం వినిపిస్తూనే ఉంది. అన్ని వర్గాల మహిళలు న్యాయం కావాలని, ఇక నుంచి అయినా తమకు రక్షణ కల్పించాలని రోడ్డెక్కుతున్నారు. ఈ నేపథ్యంలో మహిళా ఉద్యోగులు తాము పని చేసే చోట సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. దేశంలో ఇంకెక్కడా ఇలాంటి ఘటనలు పునారవృతం కాకుండా చట్టాలను కఠినతరం చేయాలని ఉద్యమిస్తున్నారు. గతంలో ఎన్నో ఘటనలు జరిగినా, కోల్‌కతా ఘటనకు ప్రధాన కారణం మత్తుపదార్థాల వినియోగం, శాంతి భద్రతలు క్షీణించడం, రాజకీయ జోక్యంతో నేరగాళ్లు చెలరేగిపోతున్నారనే వాదనలు గట్టిగా వినిపిస్తున్నాయి..

భద్రత ఎంత .?

వైద్యులకు ఆస్పత్రుల్లో భద్రత ఎంతనేది ప్రశ్నార్థకంగా మారింది. టీచింగ్, జిల్లా ప్రభుత్వ ఆస్పత్రుల్లో అనుమతుల కోసం ఎంసీఐ తనిఖీలు చేసినప్పుడే ఉమెన్ ఫ్రెండ్లీగా ఉందా ? లేదా ? అనేది చూడాలి. మహిళా వైద్యులు రాత్రి విధులు నిర్వహించే సమయంలో విశ్రాంతి తీసుకునేందుకు ప్రత్యేక గదులు ఉండాలి. అలా లేకపోవడమే కోల్‌కతా ఘటనకు ప్రధాన కారణమైంది.

చట్టం..నిర్లక్ష్యమా..?

పని ప్రదేశంలో మహిళలపై లైంగిక వేధింపుల నిరోధక చట్టాన్ని అమలు చేయడంలో పూర్తిగా నిర్లక్ష్యం కనిపిస్తోంది. తాజాగా సుప్రీంకోర్టు దీనిపై ప్రభుత్వాలకు సూచనలు జారీ చేసింది. మహిళలు పని చేసే ప్రతిచోట ఇంటర్నల్ కంప్లెంట్ కమిటీ, లోకల్ కంప్లైంట్ కమిటీ ఉండాలి. డ్యాష్‌బోర్డు నిర్వహించాలని తెలిపింది. అలాగే షీ బాక్స్‌లు అన్ని చోట్లా ఉండాలనే నిబంధన పెట్టాలి. పోష్ చట్టం అమలుకు ప్రత్యేక బడ్జెట్‌ను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కేటాయించాలని వైద్య విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు.

జిల్లా సమాచారం..

జిల్లా ఆస్పత్రి	1
ఏరియా ఆస్పత్రి	4
సీహెచ్‌సీలు	8
పీహెచ్‌సీలు	50
అర్బన్ హెల్త్ సెంటర్లు	15

పనిచేస్తున్న మహిళా వైద్యులు, సిబ్బంది	2వేల మంది
పీజీ వైద్యులు	200 మంది
నర్సింగ్ విద్యార్థులు	500 మంది
షిఫ్టుల వారీగా పనిచేసే వారు	800 మంది
ప్రతిరోజూ ఓపీకి వచ్చే వారి సంఖ్య	10 వేలు
ఇన్ పేషెంట్ల సంఖ్య	1300
రోగులతో పాటు వచ్చే సహాయకులు, బంధువులు	16 వేల మందికి పైగా..
జిల్లా ఆస్పత్రిలో సీసీ కెమెరాలు	30
సీహెచ్‌సీ, పీహెచ్‌సీ, ఏరియా ఆస్పత్రుల్లో సీసీ కెమెరాలు	90



వెలుస్తున్న బోర్డులు

కోల్‌కతా హత్య ఘటనతో జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలోని ప్రతి విభాగం ఎదుట డాక్టర్లపై నేరాలకు పాల్పడితే శిక్షలు తెలిపేలా బోర్డులను ఏర్పాటు చేశారు. అలాగే ఏరియా, సీహెచ్‌సీల్లో కూడా ఇలాంటి బోర్డులు కొత్తగా దర్శనమిస్తున్నాయి. ఈ బోర్డులు ఆస్పత్రికి వచ్చే రోగులు, ప్రజల చేత చదివిస్తున్నాయి. పీహెచ్‌సీల్లో కూడా ఇలాంటి బోర్డులు పెట్టేందుకు సిద్ధమయ్యారు.

జిల్లాలో కొన్ని ఘటనలు...

- ఐదేళ్ల కిందట తన కుమార్తెకు జ్వరం వచ్చిందని ఓ తల్లి జిల్లా ఆస్పత్రిని ఆశ్రయించింది. రాత్రి తాగివచ్చిన తండ్రి..అతని భార్యను ఆస్పత్రి మిద్దె పైకి తీసుకెళ్లి బ్లేడ్‌తో విచక్షణా రహితంగా దాడి చేసి హత్యయత్నానికి పాల్పడ్డాడు. ఆ తల్లి కేకలు వేయడంతో అక్కడ ఉన్నవారు కాపాడగలిగారు. అప్పటి నుంచి ఆస్పత్రి అధికారులు చర్యలు చేపట్టారు.
- రెండేళ్ల కిందట ఉద్యోగానికి దరఖాస్తు చేసుకునేందుకు వచ్చిన ఓ యువతితో ఆస్పత్రిలో పనిచేసే ఓ ఉద్యోగి అసభ్యకరంగా ప్రవర్తించాడు. ఈ విషయం యువతి బంధువులకు తెలిసి ఉద్యోగిని చితకబాదారు. దీనిపై అధికారులు వెంటనే స్పందించి, చర్యలు చేపట్టారు.



నిఘా వ్యవస్థను పటిష్టం చేస్తూ, అపరిచితులను లోపలకు అనుమతించని సెక్యూరిటీ

- ఐరాలలో పనిచేసే వైద్య సిబ్బందిపై కూటమినేత దాడి చేశారు. ఈ విషయం బయటకు చెబితే ఇబ్బందులు తప్పవని భావించి ఫిర్యాదు చేయడానికి వెనకడుగు వేస్తూ, లోలోపాలే కుంగిపోయింది.

అన్ని ఆస్పత్రుల్లో అప్రమత్తం..

గతంలో జరిగిన కొన్ని సంఘటనలు, కోల్‌కతా హత్య ఘటన దృష్ట్యా జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి అధికారులు, అపోలో నిర్వాహకులు అప్రమత్తమయ్యారు. ఆస్పత్రి నిఘా నిర్వహణ లోపాలను సరిదిద్దారు. నిఘా వ్యవస్థ పకడ్బందీగా పనిచేసేలా సీసీ కెమెరాల పనితీరును పరిశీలిస్తున్నారు. తద్వారా ఆస్పత్రిలో మూడో కన్ను పటిష్టమైంది. సెక్యూరిటీ సిబ్బందిని అలర్ట్ చేశారు. అనవసరంగా లోపలకు వచ్చే మగవారిని, రాత్రి పూట వచ్చేవారిని సైతం ఆరా తీసి వెనక్కి పంపిస్తున్నారు. ప్రధానంగా ప్రసూతి విభాగంలో రాత్రి 9 గంటల తరువాత మగవారిని అనుమతించట్లేదు. అలాగే ఎంఎస్ వార్డులో ఇదే విధానాన్ని అవలంభిస్తున్నారు. మద్యం సేవించి వచ్చే వారిని గేటు బయటి నుంచే పంపించేస్తున్నారు.



ప్రసూతి విభాగం ఎదుట ఉన్న సీసీ కెమెరాలు

ఊపిరి పోసే మాపై దాడులా



వైద్యులు ఒకరి ప్రాణాలను కాపాడేందుకు ప్రయత్నిస్తారు. కొన ఊపిరితో వచ్చిన వారికి ఊపిరి పోయాలనే చూస్తాం. అలాంటి మాపై అరాచక శక్తులు విరుచుకుపడుతున్నాయి. దాడులు చేస్తూ.. హత్యలకు పాల్పడుతున్నారు. కోల్‌కతా ఘటన మమ్మల్ని కలవరపాటుకు గురిచేసింది. ఈ దారుణం మరెక్కడా జరగకూడదని చూస్తున్నాం. భద్రత కోసం పోరాడుతున్నాం.

– ఎం.ఆశ, పీజీ డాక్టర్, జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి, చిత్తూరు

రక్షణ ఇవ్వాలి



వైద్య వ్యవస్థ ఒక్కటే కాదు.. అన్ని విభాగాల్లోని మహిళలకు కనీస భద్రత లేదు. స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్లు అవుతున్నా మహిళలు రోడ్డుపై స్వేచ్ఛగా తిరగాలంటే భయం వేస్తోంది. కోల్‌కతా ఘటన జీర్ణించుకోలేనిది. దానిపై ప్రభుత్వాలు స్పందించకోవడం దారుణం. ఇలాంటివి పునరావృతం కాకుండా చూడాలంటే చట్టాలు కఠినతరంగా అమలు చేసి..ప్రభుత్వాలు మహిళా వైద్యులకు రక్షణగా నిలవాలి.

– సునీత, పీజీడాక్టర్, జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి, చిత్తూరు

దాడులపై వెంటనే స్పందించాలి..



చిత్తూరుతో పాటు తిరుపతి జిల్లాల్లోని ఆస్పత్రుల్లో పనిచేసే వైద్యులు, సిబ్బందిపై జరుగుతున్న దాడులపై ఎప్పటికప్పుడు ప్రభుత్వం స్పందించాలి. దాడికి పాల్పడిన వారిని అదుపులోకి తీసుకోవాలి. చిత్తూరు ఆస్పత్రిలో ఇటీవల జరిగిన స్టాఫ్‌నర్సుపై ఓ రోగి దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. ఆమె తలకు నాలుగు కుట్లు పడ్డాయి. ఇలాంటివి జరగకుండా ముందు చర్యలు తీసుకోవాలి.

– రాణి, జిల్లా ఎన్‌జీఓ మహిళా సంఘ అధ్యక్షురాలు, చిత్తూరు (హెడ్‌నర్స్)

నిర్భయంగా చెప్పవచ్చు



మహిళా వైద్యులు, సిబ్బందిపై దాడులు జరిగినా, ప్రయత్నించినా నిర్భయంగా చెప్పవచ్చు. దాడికి యత్నించిన వ్యక్తిపై చట్టరీత్యా చర్యలు తీసుకునేలా చూస్తాం. జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో 30కి పైగా సీసీ కెమెరాలు పెట్టాం. ఏరియా ఆస్పత్రి, ఏరియా ఆస్పత్రుల్లో కూడా అడుగడుగునా సీసీ కెమెరాలు బిగించాం. దాడులు, అసభ్యకరంగా ప్రవర్తించినా వీటి నుంచి ఎవరు తప్పించుకోలేరు.

– రాజశేఖర్‌రెడ్డి, డీసీహెచ్ఎస్, చిత్తూరు

ఆశలు మునిగి.. కన్నీళ్లు మిగిలి

మొదలే సెలవు దినం కావడంతో ఓ తల్లి, తనబిడ్డలను పొలం వద్దకు తీసుకెళ్లింది. పొద్దున్నుంచి సాయంత్రం దాకా అక్కడే గడిపారు. ఉన్న రెండు ఆవులను పిల్లలతో కలిసి మేపుకుని, పొద్దుగూకడంతో ఇంటికి బయలుదేరారు. మార్గమధ్యలో ఆవులకు దాహం వేయడంతో పక్కనే ఉన్న ఫాంపండ్ గుంతలోకి పరుగులు తీశాయి. వాటి పగ్గాలు పట్టుకున్న చిన్నారిని ఈడ్చుకెళ్లడంతో గుంతలో పడిపోయింది. కుమార్తెను కాపాడే ప్రయత్నంలో తల్లి కూడా గుంతలోకి దిగి నీటమునిగి ప్రాణాలు వదిలింది. ఈ ఘటన చౌడేపల్లెలో తీవ్ర విషాదాన్ని మిగిల్చింది.

నీటి గుంతలో పడి మహిళా కానిస్టేబుల్, కూతురు మృతి

- ఆవులు మేపడానికి వెళ్లి కానరాని లోకాలకు..
- నీటి కోసం గుంతలోకి ఈడ్చుకెళ్లిన ఆవు
- తాడు పట్టుకోవడంతో ముందుగా గుంతలో పడిన బిడ్డ
- కుమార్తెను కాపాడబోయి నీట మునిగిన తల్లి
- కాటిపేరిలో విషాదం



పిల్లలతో కానిస్టేబుల్ భర్త కుమార్‌రెడ్డి(ఫైల్)



మౌనిక మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు(ఇన్‌సెట్) మౌనిక



మృతి చెందిన చిన్నారి అనీషారెడ్డి

చౌడేపల్లె: ఫాంపండ్ గుంతలో పడి తల్లీ బిడ్డ మృతిచెందిన ఘటన స్థానికంగా విషాదాన్ని మిగిల్చింది. వివరాలు.. పుంగనూరు నియోజకవర్గం, చౌడేపల్లె మండలం, కాటిపేరి పంచాయతీ, కాటిపేరి గ్రామానికి చెందిన కుమార్‌రెడ్డికి రామసముద్రం మండలం, కొండూరుకు చెందిన కె.మౌనిక (32)తో వివాహమైంది. ఈమె మదనపల్లె సెబ్ లిక్కర్ డిపోలో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. అలాగే పుంగనూరు పట్టణంలోని షాపులు, బోయకొండ వద్ద ఉన్న మద్యం షాపులకు ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. ఆదివారం సెలవు దినం కావడంతో ఇద్దరు పిల్లలు అనీషారెడ్డి(07), తనీష్‌రెడ్డి(05)తో కలిసి పొలం వద్దకు వెళ్లారు. అక్కడ ఉన్న పాడి ఆవులను ఉదయం నుంచి సాయంత్రం వరకు సమీపంలోని గిరిజాపురానికి వెళ్లే మార్గంలో మేపుకుంటూ సాయంత్రం ఇంటికి బయలు దేరారు. ఓ రైతు పొలంలో ఉన్న నీటిని చూసిన ఆవులు గంతేస్తూ నీటి వద్దకు పరుగులు తీశాయి. అనీషారెడ్డి పట్టుకున్న ఆవు తాడుతోసహా ఈడ్చుకుంటూ ఫారంపండ్ గుంతలో పడేసింది. దీన్ని గమనించిన తల్లి మౌనిక ఆ గుంతలోకి దిగి బిడ్డను కాపాడే ప్రయత్నం చేసి నీటమునిగిపోయింది. మరో బిడ్డ తనీష్‌రెడ్డి వారి చూస్తూ గట్టుపైనే వెక్కిళ్లు పెడుతుండడంతో అటుగా వచ్చిన స్థానికులు గమనించి గుంతలో దిగి తల్లీబిడ్డను బయటకు తీశారు. కానీ అప్పటికే వారిద్దరూ మృతిచెందడంతో ఒక్కసారిగా విషాదం అలముకుంది. బంధువుల రోదనలు మిన్నంటాయి. మృతురాలి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు స్థానిక పోలీసులు తెలిపారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం పుంగనూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ఎంపీపీ పదవి కోసమే అక్రమ కేసులు

- అన్యాయంగా మా నాన్న, అన్నను అరెస్టు చేశారు
- కుప్పం నుంచే తిరుగుబాటు మొదలవుతుంది
- ఎన్ని కేసులు పెట్టినా మా నడక జగనన్న వెంటే
- కుప్పం ఎంపీపీ అశ్విని



కుప్పంరూరల్: 'మా తండ్రి, అన్నయ్యను అక్రమంగా అరెస్టు చేశారు' అని కుప్పం ఎంపీపీ కుమారి అశ్విని ఆరోపించారు. కేవలం పదవీ కాంక్షతో అధికార పార్టీ నాయకులు, పోలీసులు ఇలాంటి తప్పుడు కేసులు బనాయిస్తున్నారని ఆరోపించారు. తాము వైఎస్సార్‌సీపీలో యాక్టివ్‌గా ఉన్నామని, మరో వైపు తనను ఎంపీపీ పదవి నుంచి తొలగించాలని అధికార పార్టీ నాయకులు కుయుక్తులు పన్నుతున్నారని వాపోయారు. 8 నెలల క్రితమే ట్రాక్టర్ దొంగతనం చేసినట్లు తన తండ్రి, సోదరుడిపై అభియోగాలు మోపారని, మరి పోలీసులు ఇంతకాలం ఏమి చేశారని ప్రశ్నించారు. ట్రాక్టర్లు, స్కూటర్లు దొంగతనం చేయాల్సిన దుస్థితిని ఆ దేవుడు తమకు కల్పించలేదన్నారు. పైగా అట్రాసిటీ కేసును కూడా 8 నెలల క్రితమే నమోదు చేస్తే అప్పుడే పోలీసులు విచారణ చేపట్టి తప్పుడు కేసుగా కొట్టేశారని తెలిపారు. ప్రస్తుతం తన తండ్రి, మండల కన్వీనర్ హెచ్‌ఎం మురుగేష్, తన అన్న, వన్నెకుల క్షత్రియ రాష్ట్ర కార్పొరేషన్ మాజీ చైర్మన్ వనిత భర్త శీనుపై అట్రాసిటీ కేసులు పెట్టడం వెనుక టీడీపీ నేతల ఉద్దేశం ఏమిటో స్పష్టంగా అర్థం అవుతోందన్నారు. ఎన్ని కుట్రలు పన్నినా భయపడమని, కోర్టులపై తమకు నమ్మకం ఉందని, అక్కడే తేల్చుకుంటామన్నారు. ఓ మహిళ, పెళ్లి కాని యువతి ఎంపీపీగా ప్రజలకు సేవ చేస్తుంటే అధికార పార్టీ నాయకులు జీర్ణించుకోలేక, తప్పుడు కేసులతో భయపెట్టాలని చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆయన పార్టీ మహిళలకు ఇచ్చే మర్యాద ఇదేనా ? అని ప్రశ్నించారు. కుప్పం నుంచే తిరుగుబాటు మొదలవుతుందన్న విషయాన్ని టీడీపీ నేతలు గుర్తు పెట్టుకోవాలన్నారు. ''దేవుడు ఉన్నాడు.. ధర్మం గెలుస్తుంది.. ప్రాణం ఉన్నంత వరకు మా నాయకుడు జగనన్న చూపిన బాటలోనే నడుస్తా.. ప్రజాసేవలోనే ఉంటా'' అని అశ్విని గద్గద స్వరంతో మాట్లాడారు. ఇదే విషయాన్ని ఆమె సోషల్ మీడియా వేదికగా ఫేస్‌బుక్‌లో పంచుకున్నారు.

జాయింట్ కలెక్టర్‌గా అభిషేక్



నూతన జేసీ అభిషేక్

చిత్తూరు కలెక్టరేట్ : ఐఏఎస్ 2019వ బ్యాచ్‌కు చెందిన వి.అభిషేక్‌ను జాయింట్ కలెక్టర్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. గతంలో జేసీగా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాసులు గుంటూరు నగరపాలక కమిషనర్‌గా బదిలీ అయ్యారు. అప్పటి నుంచి జేసీ పూర్తి బాధ్యతలను కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీనే నిర్వహిస్తున్నారు. తమిళనాడు రాష్ట్రం చెన్నైకి చెందిన అభిషేక్‌ను జేసీగా నియమించారు. ఈయన 2019లో ఐఏఎస్‌కు ఎంపికయ్యారు. 2020లో ట్రైనీ కలెక్టర్‌గా ప్రకాశం జిల్లాలో ట్రైనీ కలెక్టర్‌గా శిక్షణ పూర్తి చేశారు. 2021వ సంవత్సరం నుంచి 2023 వరకు పాడేరు సబ్‌కలెక్టర్‌గా, ప్రస్తుతం పాడేరు ఐటీడీఏ ప్రాజెక్టు ఆఫీసర్‌గా ఆయన విధులు నిర్వహిస్తున్నారు. మొట్టమొదటిసారిగా జాయింట్ కలెక్టర్‌గా ఆయన జిల్లాకు విచ్చేస్తున్నారు. రెండు, మూడు రోజుల్లో ఆయన జేసీగా బాధ్యతలు స్వీకరించనున్నారు.

క్లుప్తంగా

కాణిపాకంలో భక్తుల రద్దీ


బారులు తీరిన భక్తులు

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. ఉదయం నుంచి రాత్రి వరకు కూడా భక్తుల రద్దీ అలానే కొనసాగింది. ఉచిత దర్శనం, శీఘ్ర, అతిశీఘ్ర దర్శనంతో పాటు వీఐపీ దర్శన క్యూలైన్లు అన్నీ కూడా కిక్కిరిశాయి. రద్దీ దృష్ట్యా ఆలయ అధికారులు చర్యలు తీసుకున్నారు. దీంతో భక్తులు కూడా ఇబ్బంది లేకుండా స్వామివారిని దర్శించుకున్నారు.

పంట పొలాలపై గజదాడులు


ఏనుగుల దాడిలో దెబ్బతిన్న వరి పంట

ఐరాల: మండలంలో ఏనుగుల దాడులు మళ్లీ తీవ్రమవుతున్నాయి. మండలంలోని పోతపాళ్యంఇండ్లు సమీపంలోని పంట పొలాలపై శనివారం రాత్రి ఏనుగుల గుంపు స్వైరవిహారం చేశాయి. గ్రామానికి చెందిన రైతులు రంగనాథ్, జయమ్మ, భాస్కర్ వరి పంటను తొక్కి నాశనం చేశాయి. అలాగే హరి, రామకృష్ణ చెరుకు పంట తిని తొక్కి నాశనం చేశాయి. సుమారు రూ.50 వేల వరకు నష్టం వాటిల్లిందని బాధితులు వాపోయారు. ఏనుగుల గుంపు నెలలో రెండుసార్లు పంటలపై దాడులు చేయడం పరిపాటిగా మారిందని, అటవీశాఖ అధికారులు ఏనుగుల కట్టడికి చర్యలు తీసుకుని పంటలను కాపాడాలని విజ్ఞప్తి చేశారు.

అడుగంటిన కండలేరు

కండలేరు జలాశయంలో నీరు అడుగంటింది. సోమశిల నుంచి కూడా ఇన్‌ఫ్లో తగ్గిపోయింది. దీంతో ఖరీఫ్‌లో పంటల సాగు ప్రశ్నార్థకంగా మారింది. శ్రీపొట్టిరాములు నెల్లూరు.. తిరుపతి జిల్లాలోని రైతుల్లో ఆందోళన మొదలైంది. గత ఐదేళ్లుగా కళకళలాడిన చెరువులు సైతం పూర్తిగా ఎండిపోయాయి. వందలాది ఎకరాలు బీడుబారిపోతున్నాయి. అరకొరగా సేద్యం పనులు చేపట్టిన అన్నదాతల కళ్లు ఆకాశం వంక చూసి చూసీ కాయలుకాస్తున్నాయి.

- సోమశిల నుంచి తగ్గిన ఇన్‌ఫ్లో
- డెడ్ స్టోరేజ్‌కు చేరిన నీరు
- ఎండిపోయిన చెరువులు
- ఆందోళనలో ఆయకట్టు రైతులు


కండలేరులో డెడ్ స్టోరేజీకి చేరుకున్న నీరు

సైదాపురం : తిరుపతి, శ్రీపొట్టిశ్రీరాములు జిల్లాలకు వరప్రదాయినిగా ఉన్న కండలేరు జలాశయం ప్రస్తుతం డెడ్ స్టోరేజీకి చేరుకుంది. దీంతో ఆయకట్టు రైతులకు ఖరీఫ్ సాగు సందిగ్ధంలో పడింది. ఈ క్రమంలో చెరువులన్నీ చుక్కనీరు లేక ఖాళీగానే కనిపిస్తున్నాయి. గడిచిన ఐదేళ్లుగా కళకళలాడిన జలాశయాలు, చెరువులు ఇప్పుడు నీటి జాడ కోసం ఎదురుచూపులు చూస్తున్నాయి.ప్రధానంగా కండలేరు జలాశయంలో గతంలో ఎన్నడూ లేని విధంగా 5.872 టీఎంసీలకు నీటి నిల్వ చేరడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం తిరుపతికి తాగునీటి అవసరాల కోసం ప్రతి రోజూ 100 క్యూసెక్కులు మాత్ర మే విడుదల చేస్తున్నారు.

సోమశిలలో 23 టీఎంసీలే..!

శ్రీశైలం ప్రాజెక్ట్ గేట్లు మూసివేసిన నేపథ్యంలో సోమశిల జలాశయానికి ఇన్‌ఫ్లో తగ్గింది. దీంతో సోమశిల నుంచి కండలేరు జలాశయానికి నీటి విడుదలకు అవకాశం సన్నగిల్లింది. శ్రీశైలం పైతట్టు ప్రాంతాల నుంచి వరద ఉధృతి తగ్గడంతో జలాశయం అధికారులు గేట్లు మూసి వేశారు. ఫలితంగా సోమశిలకు ప్రతి రోజు ఎగువ ప్రాంతం నుంచి 14వేల క్యూసెక్కుల పైబడి ఉన్న వరద ప్రవాహం 10వేల క్యూసెక్కులకు పడిపోయింది. ఈ ప్రవాహం మరింత తగ్గే అవకాశం కూడా ఉందని అధికారులు భావిస్తున్నారు. ప్రస్తుతం సోమశిల జలాశయంలో 23 టీఎంసీల నీటి నిల్వ మాత్రమే ఉంది.

5.872 టీఎంసీలే..!

కనీవినీ ఎరుగని రీతిలో కండలేరు డెడ్ స్టోరేజీకి చేరుకుంది.ప్రస్తుతం 5.872 టీఎంసీలు మాత్రమే జలాశయంలో నీటి నిల్వ ఉంది. ప్రధానంగా సర్వేపల్లి, వెంకటగిరి, శ్రీకాళహస్తి నియోజకవర్గాలకు చెందిన రైతులు కండలేరు నీటి ఆధార్యంతోనే పంటలు సాగు చేసుకుంటున్నారు. ప్రస్తుత పరిస్థితిల్లో ఈ మూడు నియోజకవర్గాలకు సంబంధించి ఖరీఫ్ సాగు చేపట్టే అవకాశం లేకుండా పోయింది. వర్షాలు కూడా అంతంత మాత్రంగానే కురుస్తుండడంతో భూగర్భజలాలు సైతం అడుగంటిపోయాయి.

చుక్క నీరు లేని చెరువులు

కండలేరు జలాశయం ద్వారా వచ్చే నీటితోనే చెరువులు నిండుతుంటాయి. ముఖ్యంగా సర్వేపల్లి, వెంకటగిరి నియోజకవర్గాల్లోని ఏటా కండలేరు నుంచే నీరు విడుదల చేసేవారు. ఈఏడాది కండలేరులోనే నీరు లేకపోవడంతో చెరువులు పూర్తిగా ఎండిపోయాయి.

3లక్షల ఎకరాల ఆయకట్టు

కండలేరు జలాశయం పరిధిలో సుమారు 3 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. ప్రస్తుతం ఈ భూములన్నీ బీడు పెట్టుకోవాల్సిన దుస్థితి దాపురించిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఖరీఫ్ సాగుపై ఇక ఆశలు వదిలేసుకోవాల్సిందే అని వాపోతున్నారు.


బీడుగా మారిన భూములు


చుక్కనీరు లేని కమ్మవారిపల్లె చెరువు

నిందితులను శిక్షించండి


చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలోని అత్యవసర విభాగం వద్ద రోగుల తాకిడి

- అంతవరకు పోరాటం ఆగదంటున్న పీజీ డాక్టర్లు
- జిల్లా ఆస్పత్రిలో నాలుగోరోజుకు చేరుకున్న దీక్ష
- ఆదివారం కూడా ఓపీ సేవలు బంద్
- వైద్యుల ఆందోళనకు ప్రైవేట్ ఆస్పత్రుల మద్దతు
- రోగులకు తప్పని ఇబ్బందులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): కోల్‌కతాలో వైద్య విద్యార్థినిపై లైంగిక దాడి.. హత్యను నిరసిస్తూ వైద్యులు చేపట్టిన నిరసన దీక్షలు ఆదివారంతో నాలుగోరోజు కూడా కొనసాగాయి. జిల్లా ఆస్పత్రిలో ఓపీ సేవలు నిలిపి వేసి.. ఎమర్జెన్సీ వార్డులో మాత్రమే వైద్యం అందిస్తున్నారు. సోమవారం కూడా ఇదే పరిస్థితి నెలకొంది. శస్త్ర చికిత్సల సేవలు నిలిచిపోయాయి. సేవలు నిలిచి పోయాయనే ప్రచారం నేపథ్యంలో పట్టణంతోపాటు పల్లె ప్రాంతాలకు చెందిన ప్రజలు ఆస్పత్రికి రాలేదు. వచ్చిన కొద్దిమంది ఓపీ సేవలు లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు.

నిరసన..దీక్ష ..

వైద్య విద్యార్థిని హత్యను నిరసిస్తూ నాలుగురోజులుగా పీజీడాక్టర్లు నిరసన దీక్ష చేపడుతున్నారు. ఆదివారం వినూత్న రీతిలో ధర్నా చేయడంతో పాటు నిరసన ర్యాలీలతో హోరెత్తిస్తున్నారు. మెడికల్ కళాశాలల ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, ప్రభుత్వ, ప్రైవేటు వైద్యులు, వైద్య సిబ్బంది మద్దతు ఇస్తున్నారు. జిల్లా ఆస్పత్రి నుంచి చర్చివీధి మీదుగా గాంధీ విగ్రహం వరకు ప్రతి రోజు ప్లకార్డులు చేత పట్టుకుని నినాదాలు చేస్తూ నిరసన తెలుపుతున్నారు. దుండగులను పట్టుకోవడంలో పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడుతున్నారు. హంతకులను వెంటనే పట్టుకుని శిక్షించాలని డిమాండ్ చేస్తున్నారు.

అత్యవసర సేవలకు...

జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో ఎమర్జెన్సీ సేవల విషయంలో డాక్టర్లు, వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉన్నారు. ఓపీ సేవలు నిలిచిపోవడంతో అత్యవసర విభాగానికి రోగుల తాకిడి పెరిగింది. వచ్చిన రోగులను తిప్పి పంపకుండా మరో గదిని అత్యవసర సేవల కోసం వాడుకుంటున్నారు. వచ్చిన రోగులను పరీక్షించి మందులు, మాత్రలు ఇచ్చి పంపుతున్నారు. ఆరోగ్య పరిస్థితి బాగలేని పక్షంలో వారిని అడ్మిట్ చేసుకుని వైద్యం అందిస్తున్నారు. ఎప్పటికప్పుడు ఆస్పత్రి అధికారులు సైతం అత్యవసర సేవల వివరాలను ఆరా తీస్తున్నారు. ఇక ఎంఎస్ వార్డు గ్రౌండ్ ఫ్లోర్, మొదటి, రెండవ అంతస్తుల్లోని జనరల్ వార్డుల్లో వివిధ అనారోగ్య సమస్యలతో అడ్మిట్ అయిన 150 మందికి పైగా రోగులు ఉన్నారు. వారిని ఉదయం సమయంలో డాక్టర్లు పరీక్షించగా.. మధ్యాహ్నం, సాయంత్రం వైద్య సిబ్బంది పర్యవేక్షిస్తున్నారు. సోమవారం కూడా దీక్షను కొనసాగించనున్నట్లు పీజీ డాక్టర్లు చెబుతున్నారు.

రెండు కిలోల గంజాయి సీజ్

– నిందితుడి అరెస్టు

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలో గంజాయి విక్రయిస్తున్న గణేష్ (35) అనే నిందితున్ని టూటౌన్ పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. సీఐ నెట్టికంఠయ్య కథనం మేరకు.. చిత్తూరు లక్ష్మీనగర్ కాలనీకి చెందిన గణేష్ జులాయిగా తిరుగుతున్నాడు. ఆదివారం ఎస్ఐ ప్రసాద్ తన సిబ్బందితో కలిసి ప్రశాంత్ నగర్ కూడలి వద్ద తనిఖీలు చేస్తుండగా గణేష్ పారిపోవడానికి ప్రయత్నించాడు. అతన్ని వెంబడించి తనిఖీ చేయగా.. ఓ సంచిలో రెండు కిలోల గంజాయి లభించింది. దీంతో గంజాయిను స్వాధీనం చేసుకుని, నిందితున్ని అరెస్టు చేశారు.

చిరుతదాడిలో పాడి ఆవు మృతి


మృతిచెందిన ఆవును పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారులు

చౌడేపల్లె: చిరుతదాడిలో పాడి ఆవు మృతి చెందిన సంఘటన ఆదివారం కోటూరు సమీపంలోని తవళం బీట్ రిజర్వు ఫారెస్టులో వెలుగులోకి వచ్చింది. కోటూరుకు చెందిన హుస్సేన్ సాబ్ పాడి ఆవులను పోషించుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. శనివారం ఎప్పటిలాగే సమీపంలోని అటవీ ప్రాంతానికి పశువులను మేపులకు తోలుకెళ్లాడు. రాత్రి ఎంతసేపటికీ ఆవు ఇంటికి రాకపోవడంతో అటవీ ప్రాంతంలో గాలించగా ఆవు మృతి చెంది ఉండడాన్ని గుర్తించాడు. విషయం తెలుసుకున్న మదనపల్లె డిప్యూటీ ఫారెస్ట్ రేంజర్ మదన్ మోహన్, బీట్ ఆఫీసర్ దివ్య సంఘటనా స్థలాన్ని సందర్శించారు. వెటర్నరీ అసిస్టెంట్ హరిత ఆధ్వర్యంలో పోస్టుమార్టం నిర్వహించారు. సుమారు రూ.60 వేలు విలువ చేసే ఆవును కోల్పోయిన తనను ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరుతున్నాడు.

పది లీటర్ల సారా స్వాధీనం

సదుం: మండలంలోని ఎర్రాతివారిపల్లె సమీపంలోని కాలనీలో ఆదివారం కార్డన్ సర్చ్ నిర్వహించినట్లు ఎస్ఐ షేక్షావలి తెలిపారు. ఈ తనిఖీల్లో కల్పన అనే మహిళ వద్ద పది లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు ఆయన చెప్పారు. నిందితురాలిని అరెస్ట్ చేసి, కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. అక్రమంగా మద్యం అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

15 మంది ఎర్ర స్మగ్లర్ల అరెస్ట్


పోలీసుల అదుపులో ఎర్రస్మగ్లర్లు

తిరుపతి మంగళం : ఎర్రచందనం కోసం అడవిలోకి చొరబడుతున్న 15 మందిని టాస్క్ ఫోర్సు పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి సంచులు, గొడ్డళ్లను స్వాధీనం చేసుకున్నారు. టాస్క్ ఫోర్సు ఇన్‌చార్జి, ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాల మేరకు టాస్క్ ఫోర్సు ఎస్పీ పి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆర్ఐ (రిజర్వుడు) కె.సురేష్‌కుమార్‌రెడ్డి పర్యవేక్షణలో ఆర్ఎస్ఐ వై.విశ్వనాథ్ టీమ్ తిరుపతి సమీపంలోని మంగళం నుంచి కరకంబాడి మీదుగా బాలపల్లె వైపు కూంబింగ్ చేపట్టారు. ఆదివారం ఉదయం టీఎన్ పాళ్యం సెక్షన్ కరకంబాడి సమీపంలోని శ్రీవేంకటేశ్వర స్వామి గుడి వైపుగా కొంతమంది అడవిలోకి వెళుతూ కనిపించారు. వారని హెచ్చరించి చుట్టుముట్టగా కొందరు పారిపోయారు. అయితే 15 మందిని అదుపులోకి తీసుకోగలిగారు. వారిని తమిళనాడు తిరువన్నామలై జిల్లా జమనామత్తూరుకు చెందిన అరుల్ (26), ఆనందన్ గోపాల్ (26), సేతు అన్నామలై (27), జయమణి ((29), చక్రవర్తి (36), శివలింగం రామన్ (40), కుప్పుస్వామి కొలంధై (28), రంజిత్ మాణిక్యం (24), కుప్పన్ గోవిందన్ (48), గోవిందరాజ్ అరుణాచలం (49), శివలింగం మొట్టియన్ (38), ఏలుమలై (42), సంతోష్ శెల్వరాజ్ (20), మహేంద్రన్ గోవిందన్ (29), జయవేల్ (26)గా గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన ఎస్ఐ రఫీ దర్యాప్తు చేస్తున్నారు.

బైక్‌లు ఢీకొని సెక్యూరిటీ గార్డు దుర్మరణం

తడ: జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో మాంబట్టు సెజ్‌లోని ఓ ప్రైవేటు పరిశ్రమలో పని చేస్తున్న సెక్యూరిటీ గార్డు మృతి చెందాడు. ఎస్ఐ నరసింహారావు కథనం మేరకు.. తడ మండలం, కారిజాత గ్రామానికి చెందిన డి.రామకృష్ణారెడ్డి(60) స్కూటీపై విధులకు హాజరయ్యేందుకు బయలుదేరాడు. జాతీయ రహదారి కూడలి నుంచి మాంబట్టుకు వెళ్లేందుకు స్కూటీ మలుపు తిరుగుతున్న సమయంలో చెన్నై నుంచి సూళ్లూరుపేట వైపు వెళుతున్న బుల్లెట్ ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రామకృష్ణారెడ్డిని అపాచీ పరిశ్రమకు చెందిన అంబులెన్స్‌లో సూళ్లూరుపేటలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మరణించాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం అనంతరం మృత దేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

కర్ణాటక మద్యం పట్టివేత

– నిందితుడి అరెస్టు, కారు సీజ్

పలమనేరు: కర్ణాటక నుంచి ఏపీలోకి అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని స్వాధీనం చేసుకుని నిందితున్ని అరెస్ట్ చేసి అందుకు ఉపయోగించిన కారును సైతం పలమనేరు పోలీసులు సీజ్ చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను అర్బన్ సీఐ నరసింహరాజు ఆదివారం మీడియాకు వెల్లడించారు. పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్ వద్ద ఆదివారం వాహన తనిఖీలు చేస్తుండగా ఓ నల్లటి రంగు కారు వేగంగా వెళ్లడంతో అనుమానం వచ్చి దాన్ని వెంబడించి పట్టుకున్నారు. అందులో తనిఖీ చేయగా కర్ణాటకకు చెందిన 108 లీటర్ల మద్యం, 31 బీర్లు, 1000 టెట్రాప్యాకెట్లు ఉన్నాయి. అక్రమంగా మద్యం తరలిస్తున్న పుంగనూరు తూర్పు మొగసాలకు చెందిన రాజేష్(36)ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పట్టుబడిన మద్యం విలువ రూ.84,960, సీజ్‌చేసిన కారు విలువ రూ.2.50 లక్షలుగా ఉంటుందని సీఐ తెలిపారు. నిందితుడికి కోర్టు 15 రోజుల రిమాండ్ విధించినట్లు చెప్పారు. తాను కొత్తగా ఇక్కడికి వచ్చానని కర్ణాటక మద్యం అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతామని హెచ్చరించారు. పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ మృతి


హర్షవర్ధన్‌రెడ్డి (ఫైల్)

ఏర్పేడు : సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న ఓ యువకుడు ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. వివరాలు.. శ్రీకాళహస్తి మండలం చల్లపాళెం గ్రామానికి చెందిన వంకాయలపాటి ప్రతాప్‌రెడ్డి కుమారుడు హర్షవర్ధన్‌రెడ్డి (26) చెన్నైలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం సెలవు కావడంతో స్వగ్రామానికి వచ్చాడు. తిరుపతిలోని అమ్మమ్మ ఇంటికి వెళ్లేందుకు స్కూటీలో బయలుదేరాడు. మార్గమధ్యలో ఏర్పేడు మండలంలోని సీతారాంపేట వద్ద నూతనంగా నిర్మించిన వంతెనపై తిరుపతి నుంచి శ్రీకాళహస్తికి వెళుతున్న కారు రాంగ్‌రూట్‌లో దూసుకువచ్చి స్కూటీని ఢీకొంది. ఈ ప్రమాదంలో హర్షవర్ధన్‌రెడ్డి అక్కడికక్కడే మరణించాడు. స్కూటీ పూర్తిగా దెబ్బతినగా, కారు ముందు భాగం ధ్వంసమైంది. తిరుపతికి చెందిన కారు డ్రైవర్ గణేష్ రాజు(32)ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. హర్షవర్ధన్‌రెడ్డి మృతదేహానికి పంచనామా చేసి పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శ్రీరామ శ్రీనివాసులు వెల్లడించారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి ...

పలమనేరు: మండలంలోని గొల్లపల్లిలో ఓ వ్యక్తి అనుమానాస్పందంగా మృతి చెందిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన చంద్రప్ప(46) కూలిపనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఇలా ఉండగా ఆదివారం రాత్రి ఇంటి వద్ద చంద్రప్ప రక్తపు మడుగులో పడి ఉండడాన్ని స్థానికులు గమనించి 108కు సమాచారం ఇచ్చారు. దీంతో 108 సిబ్బంది అతన్ని స్థానిక ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. అయితే ఘటనా స్థలంలో రక్తపు మరకలు ఉన్న కత్తి కనిపించింది. దీంతో పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి విచారిస్తున్నారు. పోస్టుమార్టం నివేదిక ఆధారంగా ఇది హత్య ? లేక ఆత్మహత్య ? అనే విషయం బయటపడనుంది. మృతునికి భార్య, ఇద్దరు మగపిల్లలు ఉన్నారు.

బోయకొండకు భక్తుల తాకిడి


బోయకొండ: ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

చౌడేపల్లె: పుణ్యక్షేత్రమైన శ్రీ బోయకొండ గంగమ్మ ఆలయం ఆదివారం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. అమ్మవారి దర్శనం కోసం ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అర్చకులు అమ్మవారిని ప్రత్యేక పుష్పాలు, బంగారు ఆభరణాలతో అత్యంత సుందరంగా ముస్తాబుచేశారు. కోరిన కోర్కెలు తీరిన భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలతో పాటు, జంతు బలులు ఇచ్చి మొక్కులు చెల్లించారు. ఆదివారం సెలవుదినం కావడంతో ఆలయంలో భక్తుల రద్దీ భారీగా పెరిగింది. క్యూలైన్లన్నీ నిండి కిటకిటలాడాయి. భక్తులకు ఇబ్బంది కలగకుండా ఆలయంలో సౌకర్యాలను ఆలయ ఈఓ ఏకాంబరం పర్యవేక్షించారు. భక్తులకు ఉచిత తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.

కాకిపై మనిషి కరుణ


కాకి నీరందిస్తున్న దంపతులు

ప్రస్తుతం మనిషి రోడ్డున పడితే గుక్కెడు నీళ్ల తాపి పైకి లేపే వాళ్లు లేరు. రోడ్డున పడి ప్రాణాలతో కొట్టుమిట్టాడుతుంటే ఎవరో దయ గల వ్యక్తులు తప్ప చాలామంది మనకెందుకులే అన్నట్లు వెళ్లిపోతారు. అయితే ఓ కాకి రోడ్డున పడి ప్రమాదానికి గురై కావ్..కావ్ మంటూ కేకలు పెడుతుంటే ముగ్గురు వ్యక్తులు కరుణ చూపించారు. వివరాల్లోకి వెళ్తే.. చిత్తూరు నగరంలోని గంగినేని పార్కులోని ఓ చెట్టుపై ఆదివారం రాత్రి కాకుల గుంపు చేరింది. ఈ తరుణంలో ఓ కాకి ఉన్నట్టుండి ఎగిరి రోడ్డుపై పడింది. అదే సమయంలో వేగంగా వచ్చిన ఓ వాహనం తగలడంతో కాకి గాయపడి కావ్..కావ్‌మంటూ రోడ్డుపై దొర్లుతూ కనిపించింది. అదే సమయంలో అటుగా బైక్‌పై వెళ్తున్న నాగరాజు శర్మ, మోహన అనే దంపతులు, మరో యువకుడు కాకిని కాపాడే ప్రయత్నం చేశారు. హుటాహుటినా పరుగెత్తుకు వెళ్లి వాటర్ ప్యాకెట్ తీసుకొచ్చారు. కాకి కాస్త ఊపిరి తీసుకునే వరకు నీళ్లు తాపించి, తర్వాత పార్క్‌లో వదిలిపెట్టారు.

– కాణిపాకం

సారా తయారీపై ఉక్కుపాదం


సారా, తయారీకి ఉపయోగించే సామగ్రిని స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు

- సారా బట్టీలపై పోలీసుల మెరుపు దాడులు
- 4 వేల లీటర్ల ఊట ధ్వంసం
- చిన్ననక్కలాంపల్లెలో 175 లీటర్ల సారా, వస్తుసామగ్రి స్వాధీనం

వెదురుకుప్పం: మండలంలోని పచ్చికాపల్లం పంచాయతీ చిన్ననక్కలాంపల్లె సమీప అటవీ ప్రాంతంలో సారా బట్టీలపై పోలీసులు మెరుపుదాడి చేసి 4 వేల లీటర్ల నల్లబెల్లం ఊటను ధ్వంసం చేసి, 175 లీటర్ల సారాను సీజ్ చేశారు. కార్వేటినగరం సీఐ హనుమంతప్ప కథనం మేరకు.. చిత్తూరు జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు ఆదేశాల మేరకు నగరి డీఎస్పీ నరసింహమూర్తి పర్యవేక్షణలో ఆదివారం కార్వేటినగరం సీఐ హనుమంతప్ప, వెదురుకుప్పం పోలీసులు చిన్ననక్కలాంపల్లె సమీపంలోని సారా తయారీ బట్టీలపై దాడులు నిర్వహించారు. భారీఎత్తున బట్టీలు ఏర్పాటు చేసి ఉండడాన్ని గుర్తించామన్నారు. సారా తయారీకి ఉపయోగించే 4 వేల లీటర్ల నల్లబెల్లం ఊటను ధ్వంసం చేసి, అదేవిధంగా 175 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. అలాగే 200 లీటర్ల సామర్థ్యం గల 20 ప్లాస్టిక్ డ్రమ్ములు, 6 ఐరన్ డ్రమ్ములు, 5 స్టీలు బిందెలు, 4 అల్యూమినియం పాత్రలను స్వాధీనం చేసుకున్నటుల్ తెలిపారు. వెదురుకుప్పం హెడ్‌కానిస్టేబుల్ మురళి, పోలీసు సిబ్బంది కల్యాణ్, గంగమ్మ, గవాస్కర్, రమణబాబు, ఆశీర్వాదంతో పాటు కార్వేటినగరం సర్కిల్ కార్యాలయ సిబ్బంది మోహన్, విజయకుమార్ సహకారంతో దాడులు చేసి సారాను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. సారా తయారు చేస్తున్న వారిని పట్టుకుని కేసు నమోదు చేస్తామన్నారు. గ్రామాల్లో ఎక్కడైనా సారా తయారు చేస్తున్నట్లు తెలిస్తే వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు.